ప్రజాశక్తి

శుక్రవారం 3 ఫిబ్రవరి 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు జిజిహెచ్‌లో

ప్రత్యేక ఒపి కౌంటర్ ప్రారంభం

ఇహెచ్‌ఎస్‌పై మెరుగైన వైద్య సేవలకు ఏర్పాట్లు : కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీం (ఇహెచ్‌ఎస్) ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక అవుట్ పేషెంట్ (ఒపి) విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్య శ్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపర్ స్పెషలిటీ బ్లాక్‌లో రాష్ట్ర ఉదోగులకు, పెన్షనర్లకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఒపి విభాగాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో 25 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ కార్మికులు, మరో 23 వేల మంది ప్రభుత్వ పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు కలిపి 1.40 లక్షల మంది ఇహెచ్‌ఎస్ పథకం ద్వారా వైద్య సేవలు పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. వారికి తక్షణం మెరుగైన వైద్య సహాయం అందించేలా రాష్టంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రత్యేక ఇహెచ్‌ఎస్ ఓపీ విభాగాలను ఏర్పాటు చేయాలనీ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోనే తొలిసారిగా విజయవాడ జిజిహెచ్‌లో ఒక వైద్య నిపుణుడు, ఇద్దరు సహాయక వైద్యులు, నలుగురు నర్సింగ్ సిబ్బందితో ఒపి విభాగం ద్వారా ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు (మిగతా 6లో)



విజయవాడ ప్రభుత్వాస్పత్రి సూపర్‌స్పెషాలిటీ విభాగంలో ప్రత్యేక ఒపి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే ఇహెచ్‌ఎస్ కార్డుదారులకు జిజిహెచ్ సూపర్‌స్పెషాలిటీలో అందే వైద్య సేవల వివరాలు

ప్రతి సోమవారం	గ్యాస్ట్రో ఎంట్రాలజీ
ప్రతి మంగళవారం	మానసిక వ్యాధులు, జనరల్ మెడిసిన్
ప్రతి బుధవారం	గుండె, కిడ్నీ వ్యాధులు
ప్రతి గురువారం	ఎముకలు, న్యూరాలజి, జనరల్ మెడిసిన్
ప్రతి శుక్రవారం	చర్మ వ్యాధులు, జనరల్ మెడిసిన్
ప్రతి శనివారం	ఊపిరితిత్తులు, జనరల్ మెడిసిన్

బందరు పోర్టు తీర ప్రాంత భూములకు

తుది నోటిఫికేషన్

- సరి హద్దుల గుర్తింపు ప్రక్రియ పూర్తి
- 1688.44 ఎకరాలకు సర్వే నంబర్ల కేటాయింపు
- సబ్ డివిజన్‌గా నాలుగు గ్రామాల్లోని తీర ప్రాంత భూములు




పోర్టు నిర్మాణం జరిగే ప్రాంతం

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన బందరు పోర్టు నిర్మాణం పనులు ప్రారంభం దిశగా అడుగులు పడుతున్నాయి. తాజాగా బందరు పోర్టు నిర్మాణానికి అవసరమైన సముద్ర తీర ప్రాంత భూముల సరిహద్దుల గుర్తింపు ప్రక్రియను రెవెన్యూ శాఖ పూర్తి చేసింది. నాలుగు గ్రామాల్లో 1688.44 ఎకరాలను సబ్ డివిజన్ చేసింది. నూతనంగా సర్వే నంబర్లను కేటాయించింది. భూ సేకరణకు సంబంధించిన తుది నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ భూములను పోర్టు నిర్మాణం నిమిత్తం మచిలీపట్నం పోర్టు డవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంపిడిసిఎల్)కు రెవెన్యూ అధికారులు అప్పగించారు. ఈభూముల్లో త్వరలోనే పోర్టు నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు.

గ్రామం	సర్వే నంబర్	కేటాయించిన భూమి విస్తీర్ణం (ఎకరాల్లో)
మంగినపూడి	185	806.75
తవిశపూడి	139	312.38
గోపువానిపాలెం	152	413.48
కరగ్రహారం	335	138.23
మొత్తం విస్తీర్ణం		1688.84

ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిల్లో బందరు పోర్టు నిర్మాణ పనులను ప్రారంభిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో జాతీయ రహదారి 216, పెడన రైల్వే స్టేషన్‌కు రైలు, రోడ్డు కనెక్టవిటీకి అవసరమైన 48.38 ఎకరాల భూ సేకరణకు ఇటీవల ప్రభుత్వం ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల చేసింది. భూముల ధర నిర్ణయంపై భూ యజమానులతో అధికారులు చర్చిస్తున్నారు. ధర విషయంలో భూ యజమానుల ఆమోదం పొందిన తర్వాత ఈ భూముల సేకరణకు సంబంధించి తుది నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఈక్రమంలోనే పోర్టు నిర్మాణానికి అవసరమైన తీర ప్రాంత భూములను సబ్ డివిజన్ చేసి సర్వే నంబర్లు కేటాయించి తుది నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో ఈ భూముల్లో పోర్టు నిర్మాణ పనులు చేపట్టడానికి మార్గం సుగమం అయ్యింది.



తుది నోటిఫికేషన్ కాపీ

KRISHNA DISTRICT GAZETTE

Part-2 Extraordinary

Published by Authority

GAZETTENo : 03/KST/2023 MACHILIPATNAM MONDAY 30th January -2023

SURVEY NOTIFICATION

U/s 13 of A.P.SURVEY & BOUNDARIES Act, 1923

Rc.No.A1/217 /2021, dated 30.01.2023 of District Survey and Land Records Officer, Krishna, Machilipatnam.

1.In continuation of the notification published u/s 6(1) of A.P. S & B Act, 1923, in the District Gazette No.150/KST/2022, dated 17.12.2022 (1st publication) and District Gazette No.01/KST/2023, dated 05.01.2023 (2nd publication) Ref. No.A1/217/2021 of the District Survey & Land Records Officer, Krishna, Machilipatnam the under signed hereby notifies u/s section 13 of the Andhra Pradesh Survey & Boundaries Act, 1923 that the survey operations are concluded in respect of the lands in the given schedule.

2. The survey operations were concluded given schedule lands in respect of boundary demarcation and recorded measurements are conclusive and can only be altered with the decree of any Civil Court U/s 14 of A.P. Survey and boundaries Act, 1923.

SCHEDULE

District : Krishna

Sl. No.	Name of the Mandal	Name of the Village	New Survey No. allotted	Extent as per survey Ac.Cents
1	Machilipatnam	Manginapudi	185	Ac.806.75
2		Tavisipudi	139	Ac.312.38
3		Gopuvanipalem	152	Ac.431.48
4		Karagraharam	335	Ac.138.23
	TOTAL			Ac.1688.84

Place :Machilipatnam
Date :30.01.2023

Sd/-S.Gopala Raja,
District Survey & Land Records Officer,
Krishna, Machilipatnam.

తుది నోటిఫికేషన్ ప్రకటించిన నాలుగు గ్రామాల్లోని భూముల్లో మొదటి దశలో మూడు కార్గో, ఒకటి సాధారణ బెర్తులను నిర్మించనున్నారు. బొగ్గు, ఇనుప ఖనిజం రవాణాకు ప్రత్యేకంగా ఒక బెర్త్‌ను కేటాయించనున్నారు. ఈ బెర్త్‌ల నిర్మాణానికి మొత్తం రూ.5,253.89 కోట్ల అంచనాతో మారిటైం బోర్టు టెండర్లు ఆహ్వానించింది. రూ.3,683.83 కోట్లకు మెగా సంస్థ టెండరు దక్కించుకుంది. పనులు ప్రారంభమైన తర్వాత 30 నెలల్లో పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేయాల్సి ఉంది.



అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర మున్సిపల్ పరిపాలనా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి, ఎపిఐఐసి విసి, ఎమ్‌డి సృజన, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఏప్రిల్లో 125 అడుగుల అంబేద్కర్ కాంస్య విగ్రహ ప్రతిష్టాపనకు ఏర్పాట్లు

రాష్ట్ర మున్సిపల్ పరిపాలనా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ స్వరాజ్య మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం పతిష్టాత్మకంగా చేపట్టిన అంబేద్కర్ స్మృతివనం, అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు పనులను గురువారం రాష్ట్ర మున్సిపల్ పరిపాలనా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి పరిశీలించారు. ఈసందర్భంగా శ్రీలక్ష్మి మీడియాతో (మిగతా 6లో)

పూర్తిస్థాయిలో ధాన్యం సేకరణ

పౌరసరఫరాల సంస్థ కృష్ణాజిల్లా మేనేజర్ ఎ.శ్రీధర్

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి : రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని పౌర సరఫరాల సంస్థ కృష్ణాజిల్లా మేనేజర్ ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ధాన్యం సేకరణ నిలిచిపోయినట్లు వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఇప్పటి వరకు 4 లక్షల 19 వేల టన్నుల ధాన్యం సేకరించామని, 316 ఆర్‌బికెల ద్వారా ధాన్యం సేకరణ జరుగుతోందని తెలిపారు. 100కుపైగా రైస్ మిల్లులకు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లకు ఇచ్చిన లక్ష్యం ఇంకా పూర్తి కాలేదని వివరించారు. రైతులు ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు.

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సిపిఎం ధర్నా

వార్త మెయిన్ పేజీలో

గన్నవరం వైసిపిలో

గరం...గరం...

- వేడెక్కిన గ్రూపు రాజకీయాలు
- దుట్టా, యార్లగడ్డ వ్యాఖ్యలపై వంశీ ఆగ్రహం
- వైసిపిలోనే ఉంటా...వంశీకి మాత్రం పని చేయను : దుట్టా

ప్రజాశక్తి - గన్నవరం : గన్నవరం నియోజకవర్గ వైసిపిలో ఒక్కసారిగా గ్రూపు రాజకీయాలు వేడెక్కాయి. వైసిపి నేతలు డాక్టర్ దుట్టా రామచంద్రరావు, యార్లగడ్డ వెంకట్రావు ఓ ప్రైవేటు ఫంక్షన్లో గన్నవరం ఎంఎల్ఎ వల్లభనేని వంశీమోహన్, మాజీ మంత్రి, గుడివాడ ఎంఎల్ఎ కొడాలి నానిపై చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఏగ్రామంలో ఏఇద్దరు నాయకులు కలిసినా వంశీ, దుట్టా గురించే చర్చించుకుం టున్నారు. "కొడాలి నాని ఏడో తగతి తప్పిన, ఏ సినిమాలోనైనా హీరో కంటే విలన్‌కే ఎక్కువ క్రేజ్ ఉంటుంది నియోజకవర్గానికి ఎందుకైనా ఉపయోగ పడతారా, వల్లభనేని వంశీ కొడాలి నానికి ఆస్తులెలా వచ్చాయి ? ఏ వ్యాపారం చేసి ఇంత డబ్బు సంపాదించారు? వల్లభనేని వంశీ ఆగడాలను మేం పశ్నించబట్టే మాకు ప్రజల్లో గుర్తింపు వచ్చింది, మీడియాను మేనేజ్ చేయడంలో వంశీ దిట్ట" అంటూ దుట్టా సమక్షంలో యార్లగడ్డ (మిగతా 6లో)



వల్లభనేని వంశీ, దుట్టా రామచంద్రరావు, యార్లగడ్డ వెంకట్రావు

మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-నందిగామ : మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నందిగామ ఎసిపి నాగేశ్వరరెడ్డి, సిఐ సతీష్‌లు విద్యార్థులతో నందిగామ పురవీధుల్లో డ్రగ్స్ పై అవగాహన కల్పిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. కె.వి.ఆర్ కాలేజీ నుండి గాంధీ సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి ఏసిపి నాగేశ్వరరావురెడ్డి, సిఐ సతీష్ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎసిపి మాట్లాడుతూ డ్రగ్స్ అంటే మరణం అని, డ్రగ్స్ వినియోగం చట్ట రిత్యా నేరమని, విద్యార్థులు డ్రగ్స్ కు బానిస కావద్దని అన్నారు. కన్నవాళ్ళకు కడుపు కోతను మిగల్చవద్దని తెలిపారు. సిఐ సతీష్ మాట్లాడుతూ మీ పరిసర ప్రాంతాల్లో విద్యాసంస్థల లో డ్రగ్స్ వినియోగించే వారి గురించి ఫిర్యాదు చేయండి అని, టోల్ ఫ్రీ నెంబర్ కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ ర్యాలీలో ఎస్సై పండు దొర, పోలీస్ సిబ్బంది కె.వి.ఆర్ కాలేజీ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంచికచర్ల :** కంచికచర్ల మండలం పరిటాల సమీపంలోని ఎంవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో డ్రగ్స్ వాడకం వల్ల జరిగే అనర్థాలు పై గురువారం విద్యార్థులకు


నందిగామలో...


కంచికచర్లలో..

అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నందిగామ రూరల్ సీఐ ఐవి నాగేంద్ర కుమార్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ 'డ్రగ్స్ రహిత సమాజం , యువత మేలుకో భవితను మలుచుకో డ్రగ్స్ ను వదులుకో' అనే నినాదం పై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ . నేటి యువత మత్తు పదార్థాలకు ఇట్టే ఆకర్షితులై బంగారు లాంటి తమ జీవితాన్ని నాశనం చేసుకోవడంతో పాటు కుటుంబాలలో తీవ్ర మనస్థాపానికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత సరదాగా మొదలై ఆ తర్వాత బానిసై మత్తు పదార్థాలు వాడకపోతే ఉండలేని పరిస్థితి ఏర్పడి చదువుని నిర్లక్ష్యం చేయడం జరుగుతుందని అన్నారు. యువత డ్రగ్స్ పట్ల తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోదించాలన్నారు. కంచికచర్ల ఎస్సై సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-వత్సవాయి : మండల కేంద్రమైన వత్సవాయిలో జిల్లా పరిషత్ హై స్కూల్‌లో శుక్ర, శనివారంలలో మెగా ఉచిత కంటి, దంత, జనరల్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు న్యూ హెూప్ కమిటీ నిర్వాహకులు తెలిపారు. పేద, మధ్య తరగతి ,సామాన్యుల కుటుంబాలకు ఉచిత కంటి ,దంత, జనరల్ వైద్య శిబిరం, పాటు కంటి చూపు కోల్పోయి సంబంధిత వ్యాధులు ఉన్నవారికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా క్యాట్ ట్రాక్ ఆపరేషన్ చేసి మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కళ్ళజోళ్ళు కూడా ఇస్తామని పేర్కొన్నారు. దంత పరీక్షలు చేసి మందులు కూడా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. స్వదేశీ విదేశీ డాక్టర్ సే ఆధ్యాత్మిక పరికరాలతో పరీక్ష చేసి ఉచితంగా కళ్ళజోళ్ళు ఇస్తామని పేర్కొన్నారు పూర్తి వివరాల కోసం8977464636, 94908420, నెంబర్లు సంప్రదించాలని పేర్కొన్నారు.

కాజా లక్ష్మీనారాయణకు పలువురు నివాళి



ప్రజాశక్తి-కంచికచర్ల : భవన నిర్మాణ రంగంలో కురువద్ధుడు, ఎందరికో బతుకు బాట చూపించి, భవన నిర్మాణ కార్మికులకు ఆదర్శప్రాయంగా నిలిచిన కాజా లక్ష్మీ నారాయణ కు పలువురు ప్రముఖులు, భవన నిర్మాణ కార్మికులు శ్రద్ధాంజలి ఘటించారు.. కాజా లక్ష్మీ నారాయణ అనారోగ్యం తో బుధవారం మతి చెందిన విషయం తెలిసిందే. గురువారం స్థానిక హనుమాన్ పేట లో ఇంటి వద్ద మాజీ ఎంపిపి మల్లెల పుల్లయ్య బాబు, వైసిపి నాయకులు కాలవ వాసుదేవరావు, పెదబాబు, లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు నంబూరు పెదబాబు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అద్యక్షులు పిల్లి నరశింహారావు, సిఐటియు నాయకులు కె వెంకటేశ్వరావు, నిర్మాణ కార్మికులు సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కాజా లక్ష్మీనారాయణ మతికి సంతాపంగా గురువారం కంచికచర్ల లో నిర్మాణ కార్మికులు సెలవు ప్రకటించారు. అనంతరం కాజా లక్ష్మీనారాయణ అంతిమ యాత్ర లో భవన నిర్మాణ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి అంతిమ యాత్ర లో పాల్గొన్నారు.

వేమవరంలో రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి - విజయవాడరూరల్ : కొత్తూరు-తాడేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల వేమవరంలో రూ.80 లక్షలతో రోడ్లు అభివద్ధి చేయనున్నారు. ఈ మేరకు మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావుకు ప్రతిపాదనలు పంపినట్లు సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు చెప్పారు. శాసనసభ్యులు వారి నిధులు రూ.40లక్షలు తో కాలనీ లో రోడ్లు, మినరల్ గ్రాంట్ రూ.40లక్షలతో ప్రధాన రహదారి ని అభివద్ధి చేసేలా ప్రతిపాదనలు వెళ్లాయి. నిధులు మంజూరు కాగానే పనులను చేపట్టానున్నట్లు గోపాలరావు తెలిపారు.

పాదయాత్ర విజయవంతం కావాలని ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణ మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ 28వ వార్డు కౌన్సిలర్ షేక్ సిరాజూన్, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సత్తార్ భార్య, భర్త ఇద్దరు కలిసి టిడిపి నాయకులు నారా లోకేష్ తలపెట్టిన యువగళం పాదయాత్ర సజావుగా జరగాలని కోరుతూ రాజస్థాన్ వెళ్లి అజ్మీర్ దర్గాలో గురువారం ఖాజా గరీబ్ నవాజ్ బాబా వారికి చద్దర్ ఇచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే 2024లో జరిగే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించి చంద్రబాబు నాయుడు సీఎం ఆవ్వాలని ఆకాంక్షించారు.

పోలీసుల అదుపులో ఎఆర్ కానిస్టేబుల్

ప్రజాశక్తి-నందిగామ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిను దూషించారని ఒక వ్యక్తి ఫిర్యాదు మేరకు నందిగామలో ఎఆర్ కానిస్టేబుల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జగ్గయ్యపేట చిల్లకల్లు హైవే మొబైల్ వెహికల్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు సిఎంను దూషిస్తూ మాట్లాడిన మాటలు రికార్డు చేసి ఒక వ్యక్తి పోలీసు అధికారులకు పంపించారు. జీతాల విషయంలో ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నవరత్నాలతో ప్రజారంజక పాలన : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి-కంచికచర్ల : పేద వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం దేశానికి ఆదర్శమని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు అన్నారు. కంచికచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో 16, 17 వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన ఘనత జగన్‌దే అన్నారు. నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు అందించి ప్రజారంజక పాలన అందిస్తున్నా రన్నారు. ఎస్టి ఎస్సీ బీసీలను రాజ్యాధికారంలో భాగం చేస్తూ మంత్రివర్గ విస్తరణలో కూడా వారికి పెద్దపీట వేశారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల సునీత, శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ వేమా సురేష్


పథకాలు వివరిస్తున్న ఎంఎల్‌ఎ జగన్‌మోహన్‌రావు

బాబు, ఎంపీపీ మలక్ బషీర్, జడ్పిటిసి వేల్పుల ప్రశాంతి కార్యదర్శి కనగాల రవికుమార్, వైసిపి నాయకులు వేల్పుల శ్రీనివాసరావు నారిశెట్టి శ్రీనివాస్, దేవరకొండ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభ కనబర్చిన శ్రీ విద్యా పాఠశాల విద్యార్థులు

'శ్రీ విద్యా' విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-నందిగామ : అమరావతి బాలోత్సవం 5వ పిల్లల పండుగ పేరిట జనవరి 29,30,31వ తేదిలలో శ్రీ పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన వివిధ ప్రతిభా పోటీలలో శ్రీవిద్యాహై స్కూల్ నందిగామకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు పలు విభాగాలలో బహుమతులు సాధించారు. బహుమతులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను పాఠశాల చైర్మన్ కందుల మల్లికార్జునరావు , ఎఓ మేకల సీతా రామ ప్రసాద్ , ప్రిన్సిపాల్ చిన్న జోష్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యా యులు అభినదించారు.

ఐదు నిమిషాల్లో 50 ఎక్సర్‌సైజ్‌లు

ప్రజాశక్తి-నందిగామ : కృష్ణా జిల్లా నందిగామ బ్లూమ్స్ అకాడమి ఫిట్‌నెస్ డైరెక్టర్, ట్రైయినర్ నూరుద్ధిన్ (నూరు)కు "ఎక్సర్సైజ్ ప్రొఫెషనల్ ఆఫ్ ద ఇయర్ అవార్డు" లభించింది. న్యూఢిల్లీకి చెందిన లికోయిలేషన్ ఆఫ్ ఎక్సర్సైజ్ ప్రొఫెషనల్ ఆఫ్ ఇండియా.. ఎక్సర్సైజ్ ప్రొఫెషనల్ ఆఫ్ ది ఇయర్ అవార్డును గురువారం నూరుద్దీన్‌కు అందించి ప్రశంసా పత్రం అందజేసి సత్కరించింది. న్యూఢిల్లీలోని ఇంపీరియల్ క్లబ్ ఆఫ్ ఇండియా ప్రాంగణంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఐదు నిముషాల్లో 50 ఎక్సర్సైజ్‌లు చేసి ఆలిండియా రికార్డు సాధించారు. నూరుద్ధీన్ గతంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్, ఓల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్‌లు అందుకుని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నుంచి ప్రశంసలు అందుకున్నారు. నందిగామ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రతి రోజు తెల్లవారుజామున నాలుగు గంటలకే స్త్రీ, పురుషులకు



నూరుద్ధీన్‌కు ఎక్సర్సైజ్ అవార్డు బహుకరిస్తున్న దశ్యం

విడివిడిగా ఎరోబిక్స్ వ్యాయామాలు నేర్పుతూ ఎంతోమందిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ ముందుకు సాగుతున్నారు. నూరుద్ధీన్‌కు ఎక్సర్సైజ్ ప్రొఫెషనల్ ఆఫ్ ది ఇయర్ అవార్డు రావడం పట్ల ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు అభినందనలు తెలిపారు.

గృహ సారథల నియమాకాలు వేగవంతం కావాలి

ప్రజాశక్తి - విజయవాడరూరల్ : ప్రతి 50 కుటుంబాలకు ఇద్దరు పార్టీ గృహ సారథులు (పార్టీ వాలంటీర్లు) నియామకాలు వేగవంతంగా పూర్తి చేయాలని వైసీపీ నాయకులు, మాజీ ఎఎంసి చైర్మన్ కొమ్మ కోటేశ్వరరావు (కోట్లు)పిలుపునిచ్చారు. ప్రసాదంపాడులో పార్టీ నాయకుల విస్తత సమావేశం గురువారం జరిగింది. ప్రతి సచివాలయం పరిధిలో ముగ్గురు పార్టీ కన్వీనర్లు,ఒక్కొక్క వాళ్లంటర్ పరిధిలో ఇద్దరు గహ సారథులను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన వివరించారు. ప్రతి 50 కుటుంబాలను ఒక క్లస్టర్ గా తీసుకుంటారు. ప్రతి క్లస్టర్ కి ఇద్దరు పార్టీ గహ సారథులు (పార్టీ వాలంటీర్లు) ను,ప్రతి ఇద్దరు గహ సారథులలో ఒక మహిళా,ఒక పురుషుడు ఉండాలన్నారు. ఈ సమావేశం లో జడ్పిటిసి. సువర్ణరాజు, సచివాలయాల కన్వీనర్ సాదం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ నగర పంచాయత్ పరిధిలోని 8వ సచివాలయాన్ని గురువారం మున్సిపల్ కమిషనర్ డా.ఎస్ జయరాం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ సెక్రెటరీల మూవ్మెంట్ రిజిస్టర్లు, సంక్షేమ పథకాల జాబితాలను పరిశీలించారు. రికార్డ్స్ సక్రమముగా ఉంచాలని, సకాలములో పెన్షన్ అమౌంట్ పంచగా మిగిలిన మొత్తాన్ని బ్యాంకులో జమచేయాలని సూచించారు. సచివాలయంకు సర్వీసెస్ కొరకు వచ్చినటువంటి ప్రజలను సచివాలయములో జరుగుతున్న పనులకు సంతప్తిగా ఉన్నారా లేక ఏమన్నా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్ : 57, 58, 61 డివిజన్లలో 1. 20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రహదారి నిర్మాణ పనులకు డిప్యూటీ మేయర్ అవుతూ శైలజా రెడ్డి, స్థానిక కార్పొరేటర్లతో కలిసి విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు భూమి పూజ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ న్యూ రాజరాజేశ్వరి పేటలో 19. 99 లక్షలతో నూతనంగా రహదారి తోట వారి వీధిని ఇన్నర్ రింగ్ రోడ్ లో అనుసంధానం చేస్తూ 15. 35 లక్షలు రోడ్డు నిర్మాణం, యు జి డి తాగు పైపులైన్ల పనులతో పాటు 61వ డివిజన్లో 2. 50 కోట్ల నిధులతో అభివద్ధి పరచిన వైయస్సార్ పార్క్ ని అతి త్వరలో ప్రారంభిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి కార్పొరేటర్లు ఈ దేవి రాజా రమేష్, ఉమ్మడి రమాదేవి, వెంకట్రావు, నాయకులు అవుతూ శ్రీనివాసరెడ్డి, అప్ రోజ్ కాళ్ళ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్‌లో సామాన్యులపై పన్నుల భారం : సిపిఎం



ప్రజాశక్తి-గుడివాడ : సామాన్య మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారం మోపి కార్పొరేట్లకు రాయితీలు కట్టబెట్టేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ సి పి రెడ్డి అన్నారు. గురువారం గుడివాడ కామ్రేడ్ సుందరయ్య భవనంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్ పేద ప్రజలకు సంక్షేమం కల్పిస్తుందని మన దేశ ప్రధాని ప్రకటించారని, కానీ ఈ బడ్జెట్ కార్పొరేట్లకు కట్టబెట్టే బడ్జెట్ లా ఉందన్నారు. ఈ బడ్జెట్లో గతంతో పోల్చినప్పుడు ఉపాధి హామీ పథకంలో 97 వేల కోట్లు కేటాయిస్తే ఈ బడ్జెట్లో కేవలం 60 వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. అంటే ఈ బడ్జెట్ ఉపాధిని ప్రజలకు కల్పించే బడ్జెట్ కాదు అని గత బడ్జెట్లో దేశంలో ఉన్న దళితుల సంక్షేమం కోసం అని 1819.52 కోట్లు కేటాయిస్తే ఇప్పుడు 976.86 కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. అంతేకాకుండా ఆహార భద్రతకే చట్టానికి కూడా ఈ బడ్జెట్లో నిధులు పూర్తిస్థాయిలో తగ్గించడం జరిగిందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మురాల రాజేష్ మాట్లాడుతూ విదేశీ పెట్టుబడిదారులకు, కార్పొరేట్ వర్గాలకు లాభం చేకూర్చేలా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఉందన్నారు. పేద మధ్యతరగతి వర్గాలపై పన్నుల భారాన్ని మోపుతూ సంపన్న వర్గాలకు, కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ను వ్యతిరేకిస్తున్నామన్నారు.

వ్యవసాయ రంగానికి కేటాయింపులపై నిరసన

ప్రజాశక్తి-బంటుమిల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయం, ఇతర రంగాలకు కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో బంటుమిల్లి సెంటర్‌లో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రానికి జీవనాడైనటువంటి పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడం, ఆహార సబ్సిడీకి, ధాన్యం సేకరణకు నిధులు ఘోరంగా తగ్గించటం వ్యవసాయ రంగాన్ని రైతు, కౌలు రైతులకు అన్యాయం చేయడమేనన్నారు. కోస్తా రైలు మార్గం నరసాపురం నుండి బంటుమిల్లి మచిలీపట్నం , ఒంగోలు, బాపట్ల మీదుగా కలిపే రైలు మార్గం మార్గానికి నిధులు కేటాయించకపోవడం అతి దారుణం అన్నారు. ఎస్‌కే యం, ఏఐకేఎస్ ఆధ్వర్యంలో రైతాంగానికి ఎంఎస్పీ ధర చట్టబద్ధత చేయాలని, విద్యుత్ శక్తి సవరణ బిల్లును ఉపసంహరణ, వ్యవసాయ రంగానికి అధిక శాతం సబ్సిడీ ఇచ్చి రైతాంగాని కాపాడాలని పోరాటం చేసినప్పటికీ వాటికి సంబంధించి ఈ బడ్జెట్లో కనీసం స్పందించకపోవడం, పట్టించుకోకపోవడం దురదృష్ట రమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని రైతు సంఘాన్ని రైతులను ఆదుకునే బడ్జెట్ తయారుచేయాలని అన్నారు. ఇది కేవలం కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి మండలం రైతు సంఘం అధ్యక్ష కార్యద ర్శులు లంకదాసుల అజయ్ ఘోష్, మల్లిశెట్టి శివరాం ప్రసాద్, కంఠంనేని మురళి , వెంట్రపాటి శ్యామసుందర్, నాగిశెట్టి రామారావు, గోపు వెంకన్న, గూడవల్లి సోమేశ్వరరావు, పొదిలి వెంకన్న, వంగల రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు



వెండి గిన్నెలను అందజేస్తున్న మద్దినేని దంపతులు

తిరుపతమ్మ ఆలయానికి వెండి గిన్నెల బహూకరణ

ప్రజాశక్తి-గన్నవరం : స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయానికి ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు నాగమణి దంపతులు వెండి గిన్నెలను గురువారం బహుకరించారు. గిన్నెలను ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ రావుకు అందజేశారు. అనంతరం గోపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 5న జరగనున్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి రజతోత్సవ కళ్యాణ మహోత్సవంలో భాగంగా ఈ వేడుకను జరిపారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన పాల పొంగళ్ళు సమర్పించారు. అనంతరం కన్యగోవులకు భక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. సాయంత్రం శ్రీ లలితా సహస్రనామ పారాయణం, లక్ష పుష్పార్చన జరిపారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావు, ఉప సర్పంచ్ పాలడుగు నాని, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కాసరనేని రంగబాబు, ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిరంతర సాధనే విజయానికి మార్గం

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రతి విద్యార్థి సామాన్య స్థితి నుంచి అసామాన్య స్థితికి చేరుకోవాలనే తపన కలిగి ఉండాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు విడియాల చక్రవర్తి అన్నారు. గురువారం చల్లపల్లి ఎస్ఆర్‌వైఎస్‌పీ హైస్కూలులో శ్రీమంతురాజా యార్లగడ్డ శివరామ ప్రసాద్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ముఖ్య వక్త విడియాల చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులు తెలివి, జ్ఞానం, జ్ఞాపకశక్తి, పునస్మరణ, ఏకాగ్రత, అభ్యసనాసక్తి, పఠనా సామర్ధ్యంతో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. సెల్ ఫోన్, టీవీ సీరియళ్లకు బానిసలు కావద్దని సూచించారు. విద్యార్థి దశలో కేవలం విద్యపైనే శ్రద్ధ చూపాలని సూచించారు.కఠోర శ్రమతో రాణిస్తే ప్రతి ఒక్కరూ విజేతలు కావటం సాధ్యం అన్నారు. స్వీయ క్రమశిక్షణతో ఎదగాలని సూచించారు. హైస్కూల్ ఇంచార్జిలు ఎస్. సుదర్శనధర ప్రసాద్, తుమ్మల రేణు ప్రసాద్, కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ తగిరిశ సాంబ శివరావు, అసోసియేషన్ అధ్యక్షులు గోవిందరాజుల అశ్విన్, నాదెళ్ల నాగఫణి, ఎండీ.ఏ.కే.జిలాని, ఉపాధ్యా యులు దోనేపూడి భూపాల్, రాజ్యలక్ష్మి పర్యవేక్షించారు.



'గడపగడపకూ మన ప్రభుత్వం'కు విశేష స్పందన



ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండల పరిధిలోని నాగాయతిప్ప గ్రామ సచివాలయ పరిధిలోని మోపిదేవిలంక గ్రామ పంచాయతీలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మోపిదేవిలంక సర్పంచ్ మోర్ల జ్యోత్స్న, పంచాయతీ కార్యదర్శి కమ్మిలి త్రిపుర సుందరిల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సింహాద్రి రమేష్ బాబు ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించగా, కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు, యంపిటిసి సభ్యులు సనకా వెంకటరాజేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయానికి స్థలం కేటాయింపు తగదు : టిడిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : బ్రిటిష్ కాలం నుంచి పోలీసుల సంక్షేమం కోసం కేటాయించిన కోట్లాది రూపాయల స్థలాన్ని వైసీపీ పార్టీ కార్యాలయానికి వినియోగించడం ఎంతవరకు సబబు అని తెలుగుదేశం పార్టీ మచిలీపట్నం నగర కార్పొరేషన్ కార్పొరేటర్లు, చిత్తజల్లు నాగరాము, అన్నం ఆనంద్, దింట కుర్తి సుధాకర్, దేవరపల్లి అనిత, మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ టిడిపిఇంచార్జి, పివి ఫణి కుమార్ లు ప్రశ్నించారు. గురువారం మచిలీపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశం లో వారు మాట్లా డుతూ అధికారం ఉంది కదా అని పోలీసుల క్వార్టర్స్‌కు కేటాయించిన స్థలమును అక్రమంగా వైసీపీ పార్టీ స్వప్రయోజనం కోసం వినియోగించడం అర్థరహితం అన్నారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నగర కార్పొరేషన్ నడిబొడ్డున ఉన్న జిల్లా కోర్టు సెంటర్ నందు గల స్థలమును అప్పనంగా వైసీపీ పార్టీ ప్రయోజనాల కోసం కేటాయించడం పాలకుల స్వార్థపూరిత చర్య అన్నారు. ప్రభుత్వం వేరు, పార్టీ వేరు అని పాలకులు గ్రహించాలన్నారు. అనాదిగా ప్రభుత్వానికి చెందిన ఈ స్థలమును రెవిన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు తమ సొంత స్థలం లాగా వైసీపీ పార్టీ కార్యాలయానికి కట్ట బెడుతూ ఉత్తర్వులు జారీ చేయడం అర్థరహితం అన్నారు.



మాట్లాడుతున్న టిడిపి కార్పొరేటర్లు

వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఆదేశానుసారం కృష్ణా జిల్లా కలెక్టర్ అనుమతితో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో గల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం , జిల్లా వైద్య విధాన పరిషత్, ప్రభుత్వ వైద్య డెంటల్ కళాశాలలు , ప్రభుత్వ సాధారణ వైద్యశాలలలో ఉన్న ఉద్యోగ నియామకాల కొరకు పొరుగు సేవల ద్వారా భర్తీ చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి. గీతా బాయి ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ డార్క్ రూమ్ అసిస్టెంట్ – 3, మెడికల్ రికార్డ్ అసిస్టెంట్ – 5 , మేల్ నర్సింగ్ ఆర్డర్లీ – 5 ఖాళీల కొరకు అలాగే కాంట్రాక్ట్ పద్ధతి పై రేడియేషన్ సేఫ్టీ ఆఫీసర్ –1, స్ట్రెక్చర్ బేరర్ –1 సిటీ టెక్నీషియన్ –1 ఖాళీలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నోటిఫికేషన్, దరఖాస్తులకు సంబంధించిన సమాచారాము దరఖాస్తు ఫారాలు కృష్ణ డాట్ ఎన్‌ఐసి డాట్ ఇన్ లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. పూరించిన దరఖాస్తులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయము, పరాస్ పేట నాయర్ నాయుడు బట్టి సెంటర్, మచిలీపట్నం కష్ణాజిల్లా లో ఈనెల 10వ తారీఖు సాయంత్రం ఐదు గంటలలోపు అందజేయలన్నారు.



ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : ప్రకృతి వ్యవసాయం ద్వారా చౌడు భూములలో కూడా వేరుశనగ విత్తనాలు మొలకెత్తడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రకతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న వేరుశనగ, మినుము పంట పొలాలను వ్యవసాయ శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చున్నారు. చౌడు భూములలో మినుము పంట ప్రకతి వ్యవసాయం ద్వారా సాగు చేయడం ద్వారా పురుగు మందుల ఖర్చు తగ్గిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ జీ.వి .సూర్యనారాయణ , డిపిఎం నేచరల్ ఫామింగ్ పార్థసారథి , మండల వ్యవసాయ అధికారి మచిలీపట్నం జీ వి శివప్రసాద్, పిఎసిఎస్ ప్రెసిడెంట్ వెంకన్న, ప్రకతి వ్యవసాయ క్షేత్ర సిబ్బంది, పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.



మహిళా హృదయ వారోత్సవాలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో మహిళా హృదయ వారోత్సవాలు నిర్వహించారు. గురువారం ఆ విభాగం కోఆర్డినేటర్ డిఎం రత్నకుమారి ఆధ్వర్యంలో కళాశాలలోని మన టీవీ భవనంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఉమారాణి అధ్యక్షత వహించారు. అవనిగడ్డ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళల హృదయ వ్యాధుల గురించి కళాశాల అధ్యాపకులకు విద్యార్థులకు వివరించారు. మహిళలు హృదయ ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆవశ్యకతను వివరించారు. అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ఉమారాణి మాట్లాడుతూ మహిళలు మానసికంగా స్థిరమైన వారైనప్పటికీ వారికి కూడా గుండె జబ్బులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శాంతకుమారి, మహిళా అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న రఘురాం

పెనుమత్స వర్మ మృతి బాధాకరం

ప్రజాశక్తి-వన్‌టౌన్: తెలుగు యువత నాయకుడు పెనుమత్స వర్మ మృతి బాధాకరమని పలువురు టిడిపి నాయకులు అన్నారు. మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య, 42వ డివిజన్ అధ్యక్షురాలు యేదుపాటి వెంకటరమణి, సోను, శివారెడ్డి ఆధ్వర్యంలో భవానీపురం శివాలయం సెంటర్లో గురువారం పెనుమత్స వర్మ సంస్మరణ సభ జరిగింది. టిడిపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురాం, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, బుద్దా వెంకన్న, జలీల్ ఖాన్, నాగుల్ మీరా, బోండా ఉమామహేశ్వరరావు, అధికార ప్రతినిధి లింగమనేని శివరామ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి శ్రీనివాస్, కార్యాలయ కార్యదర్శి రాధాకృష్ణ, నేలకుర్తి వెంకటరావు, సుకాసి సరిత, కాంద్రుగుల రవీంద్ర, పత్తి నాగేశ్వరరావు, పరిశపోగు రాజేష్, ముప్పా విజయశ్రీ తదితరులు పాల్గొని వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

అర్హులందరికీ పథకాలు : వెలంపల్లి

ప్రజాశక్తి-వన్‌టౌన్: నియమ నిబంధనలు ప్రకారమే అర్హులందరికీ పథకాలు ఇస్తున్నామని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు. గురువారం 49వ డివిజన్‌లోని 167వ సచివాలయం పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి దేవదానంకు కూడా సంక్షేమ పథకాలు ఇచ్చామని తెలిపారు. గతంలో చంద్రబాబు ఇళ్లు ఇస్తామని చెప్పి ప్రజలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో చంద్రబాబునాయుడు ప్రజలను మోసం చేశారన్నారు. కొండ ప్రాంత నివాసితుల సమస్యలు పరిష్కరిస్తామని వెలంపల్లి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, శ్రీనన్నదళం అధ్యక్షులు పోతిన వరప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న వెలంపల్లి


ముస్లిం మైనార్టీల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-భవానీపురం: ముస్లిం మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతిపత్రం సమర్పించినట్లు అంజుమన్ ఎ ఇస్లామియా ఎన్టీఆర్ జిల్లా కమిటీ అధ్యక్షులు షేక్ ఖాజామొహినుద్దీన్, కార్యదర్శి షేక్.నాగూర్ ఒక ప్రకటనలో తెలిపారు. భవానీపురంలోని వక్ఫ్ స్థలంలో ముస్లిం మైనార్టీలకు మినీ ఆటోనగర్ ఏర్పాటు చేయాలని, కుమ్మరిపాలెంలో శాశ్వత హజ్‌హౌస్, వక్ఫ్‌బోర్డు రాష్ట్ర కార్యాలయం ఏర్పాటు చేయాలని, మక్కా యాత్ర కోసం గన్నవరం నుంచి జెద్దాకు డైరెక్టుగా విమాన సర్వీసులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. వెలగపూడి రాజధాని ఏరియాలో 15 ఎకరాల్లో మక్కా మసీదును నిర్మించాలని, రాష్ట్ర అధికార భాషగా ఉర్దూ ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలని, ప్రతి నియోజకవర్గంలో అవసరమైనన్ని షాదీఖానాలు ఏర్పాటు చేయాలని కోరారు.



ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-వన్‌టౌన్: స్థానిక 54వ డివిజన్‌లో నివాసం వుండే వైసిపి కార్యకర్త బెవర కనకరావుకు వైద్య ఖర్చులు నిమిత్తం వెలంపల్లి ఫౌండేషన్ తరపున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గురువారం వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలో గల ఎమ్మెల్యే కార్యాలయంలో వెలంపల్లి ఫౌండేషన్ సభ్యులు కొనకళ్ళ విద్యాధరరావు, కార్పొరేటర్ యలకల చలపతిరావులు ఆర్థిక సహాయం అందజేశారు.



సాంస్కృతిక ఉత్సవ్ అదరహో...

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: రాష్ట్రస్థాయి 25వ పాలిటెక్నిక్ క్రీడా పోటీల్లో గురువారం ఉత్సాహభరిత వాతావరణం చోటుచేసుకుంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వచ్చిన విద్యార్థులు తమ సత్తా చాటేందుకు పోటీ పడుతుండగా సాయంత్రం విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవం అదరహో అనిపించింది. రీమిక్స్ పాటలకు చేసిన నృత్యాలు ఆహుతుల ఉత్సాహాన్ని రెట్టింపు చేసాయి. వడ్డేశ్వరం కెఐఎస్ పాలిటెక్నిక్ విద్యార్థులు కూచిపూడి నృత్యంతో సాంస్కృతిక ఉత్సవ్‌కు ఘన స్వాగతం పలకగా, విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు రీమిక్స్ హోరుకు అందించిన జోరైన నృత్యాలు ఉర్రూతలూగించాయి. దాదాపు గంటకు పైగా సాగిన క్యాంప్ ఫైర్ యువతకు నూతన ఉత్తేజాన్ని అందించింది. తమలో దాగి ఉన్న ప్రతిభకు దీనిని వేదికగా భావించిన విద్యార్థులు విభిన్న కోణాలను ప్రదర్శించారు. సాంస్కృతిక ఉత్సవ్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ సంచాలకురాలు చదలవాడ నాగరాణి మాట్లాడుతూ విద్యార్థులలోని క్రీడా నైపుణ్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చే క్రమంలో ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా శారీరక, మానసిక వికాసానికి తోడ్పాటును అందించే క్రీడలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 1500 మంది విద్యార్థులు మొత్తం 19 అంశాలలో పోటీ పడుతున్నారని, శుక్రవారం విజేతల వివరాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్యా శాఖ సంయుక్త సంచాలకులు పద్మారావు, సాంకేతిక విద్యా బోర్డు కార్యదర్శి విజయ భాస్కర్, సంయుక్త కార్యదర్శి జానకీరామయ్య, ప్రిన్సిపల్ విజయసారధి తదితరులు పాల్గొన్నారు.



'ఔషధ ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి పెట్టాలి'


సదస్సులో ప్రసంగిస్తున్న ఐఐసిటి ప్రిన్సిపల్ సురేష్‌బాబు

ప్రజాశక్తి-వన్‌టౌన్: రసాయన శాస్త్ర విద్యార్థులు ఔషధ ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసిటి) ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కే. సురేష్‌బాబు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల పీజీ రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'సహజ ఉత్పత్తుల ద్వారా ఔషధ ఆవిష్కరణలు' అంశంపై సదస్సును ఆ కళాశాల సెమినార్ హాల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ నూతన ఔషధాల ఆవిష్కరణలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో వచ్చిన మార్పులను విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. సహజ వనరుల నుంచి ఉద్భవించిన బయో యాక్టివ్ సమ్మేళనాలు, ఫైటోకెమికల్ విశ్లేషణ ఔషధ పరిశోధనలో చాలా కీలకమన్నారు. విద్యార్థులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వస్తున్న మార్పులను, ఆవిష్కరణలపై ఎప్పటికప్పుడు పట్టు సాధించాలన్నారు. తద్వారా ఉత్తమంగా ఎదగటానికి, అత్యుత్తమ ఆవిష్కరణలను చేయటానికి అవకాశముంటుందన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ తమ రంగాల్లో వస్తున్న మార్పులను తెలుసుకోవాలన్నారు. అందుకోసమే ఈ విధమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, విభాగాధిపతి డాక్టర్ జీ. కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-వన్‌టౌన్, సింగ్‌నగర్
టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి అర కేజీ గంజాయి స్వాధీనం చేసుకుని గురువారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు టూటౌన్ ఎస్ఐ షబీర్ అహ్మద్‌కు రాబడిన సమాచారం మేరకు గురువారం ఓల్డ్ ఆర్ఆర్ పేటకు చెందిన పిళ్ల మోహనరావు, కుమ్మరి వీధికి చెందిన సయ్యద్ సర్వర్ అలియాస్ బాజీలు గంజాయి అమ్ముతుండగా వారి వద్ద నుంచి అర కేజీ గంజాయిని స్వాధీనం చేసుకుని, వారిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పర్చారు. విజయవాడ రూరల్ ప్రాంతమైన వైఎస్ఆర్ కాలనీలోని పలు పాన్ షాపులు, పచారీ షాపులను టూటౌన్ పోలీస్‌స్టేషన్ సిఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో గంజాయి., ఇతర మాదక ద్రవ్యాలు ఏమైనా అమ్ముకాలు జరుగుతున్నాయోమో అనే అనుమానంపై తనిఖీలు నిర్వహించినట్లు సిఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. పాయకాపురం లక్ష్మీనగర్ వద్ద కేసర దేవందర్‌రెడ్డి, చక్రాల పవన్‌కుమార్, వంగిపరుపు దీపక్‌ల వద్ద నుంచి మూడు కిలోల గంజాయిని నున్న పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఆర్‌టిసి డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి-భవానీపురం: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానం చేర్చడం డ్రైవర్ల బాధ్యతని విద్యాధరపురం ఆర్టీసీ డిపో మేనేజర్ కనకమేడల సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. గురువారం 34వ రోడ్డు భద్రత వారోత్సవాలు ముగింపు కార్యక్రమం విద్యాధరపురం డిపోలో జరిగింది. డిపో మేనేజర్ కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు, కె.ఆనంద్‌బాబు, జి.రాంబాబు, సుధాకర్‌బాబు పలువురు డ్రైవర్లకు నగదు బహుమతి, ప్రసంసాపత్రాలు అందజేశారు. ట్రాఫిక్ సిఐ ఎం.సుధాకర్ మాట్లాడుతూ డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని, బస్సులను బస్సు స్టాపులలో వద్ద ఆపి ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా చూడాలని అన్నారు.





షాబుఖారి దర్గాను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి పట్టణ పరిధిలోని హజరత్ సయ్యద్ షా బుఖారి బాబాను గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. 426వ ఉరుసు మహోత్సవాలలో భాగంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ రుహుల్లా, విజయవాడ పోలీస్ కమీషనర్ కాంతి రాణాటాటా దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉరుసు ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ కాజా, హిస్టరీ అండ్ అకాడమీ డైరెక్టర్ వాజీద్ ఖాన్, 54వ వార్డు కార్పొరేటర్ హర్షద్, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, ఇబ్రహీంపట్నం సిఐ శ్రీను, ఎస్ఐలు శ్రీను, పాపారావు పాల్గొన్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, టిడిపి నేతలు కేశినేని శివనాథ్ (చిన్ని), నాగుల్‌మీరా, జంపాల సీతారామయ్య ఆస్థాన పీఠాధిపతి అల్తాఫ్ బాబా వారిని సాదరంగా మేళతాళాలతో ఆహ్వానించి ఇస్లాం సాంప్రదాయం ప్రకారం ఘనంగా సత్కరించారు. దర్గాను కొండపల్లి మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ దర్శించుకున్నారు.



మాదక ద్రవ్యాలపై అవగాహన

ప్రజాశక్తి-భవానీపురం: మాదకద్రవ్యాలపై గొల్లపూడిలోని నలంద డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీపురం సిఐ ఉమర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా చేస్తున్నా, అమ్ముతున్నా వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలన్నారు. మాదక ద్రవ్యాల నిరోధంపై డిజిటల్ స్క్రీన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నలంద డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ ఉమా, ఫణి తదితరులు పాల్గొన్నారు.

రుణాలు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని గౌరవరం వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రూ.35 లక్షలు డ్వాక్రా రుణాలు, రూ.31.98 లక్షలు జగనన్న పాల వెల్లువ రుణాలను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ సంఘ సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా పరస్పర సహకారమే లక్ష్యంగా సంపూర్ణ సహకారాన్ని పొందడమే ఉద్దేశంగా సహకార సంఘాలు ఉన్నాయన్నారు. సహకార సంఘాల ద్వారా గ్రామాలలో ఉన్న రైతన్నలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. రుణాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని, పంటలు దిగుబడిని కూడా పెంచుకోవాలని అన్నారు. సహకార సంఘంలో తీసుకున్న రుణాలను ఎప్పటికప్పుడు చెల్లిస్తూ సంఘం అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు బాల సైదా, వడ్డెర సంఘం నాయకులు వేముల మల్లేశ్వరరావు, నాయకులు శ్రీనివాసరెడ్డి, అప్పిరెడ్డి, నర్సిరెడ్డి, బొంతు రాంబాబు, మారుతి పెద్ద హుస్సేన్, మహిళా సమైక్య అధ్యక్షురాలు శ్యామల తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి
జిల్లా వార్తలు 5
శుక్రవారం 3 ఫిబ్రవరి 2023

మారుతి కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కోడూరు

కోడూరులోని మారుతి కాలేజీలో ప్రిన్సిపాల్ జెవిఎస్ఎస్ మూర్తి ఆధ్వర్యంలో బుధవారం డిగ్రీ ఫైనల్ ఇయర్, ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు వీడ్కోలు విందు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 2021-22లో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు గాను 461 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు సాధించిన తోట హేమ సాగర్, 458 మార్కులు సాధించిన కన్నా లక్ష్మీనారాయణ, 456 మార్కులు సాధించిన చలపాటి పద్మప్రియ, 454 మార్కులు సాధించిన వడ్డీ శోభితా రాణి,452 మార్కులు


బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

సాధించిన చిరుగోలంక చంద్రత, 450 మార్కులు సాధించిన కడవకొల్లు శృతిలను కాలేజీ ప్రిన్సిపాల్ ఘనంగా సత్కరించి బహుమతులు అందజేశారు. కాలేజీలో 450 పైన మార్కులు ఆరుగురు విద్యార్థులు సాధించడం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం రిపబ్లిక్ డే సందర్భంగా కాలేజీలో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి, ఇటీవల మండల స్థాయి ఆటలు పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాదికి గృహ ప్రవేశాలను సిద్ధం చేయాలి

పెదపారుపూడి ఎంపిడిఒ టి.సీతామహాలక్ష్మి

ప్రజాశక్తి-పెదపారుపూడి

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా వైఎస్సార్ జగనన్నకాలనీల్లో ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు వేగవంతం చేయాలని పెదపారుపూడి ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి కోరారు. పెదపారుపూడి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఇఒపిఆర్‌డి నాగిరెడ్డి

మండలంలోని దాసపాడు, పాములపాడు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాన్ని ఆమె పరిశీలించారు. వైఎస్సార్ జగనన్నకాలనీల్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులంతా ఉగాది కల్లా గృహప్రవేశాలు చేసేలా నిర్మాణాలను శరవేగంగా పూర్తయ్యేలా కృషిచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఈఓపిఆర్డి ఎం.నాగిరెడ్డి వైసిపి నాయకులు కుమ్మరి రాజేష్, దాసు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు


కనకమేడలకు జ్ఞాపికను అందజేస్తున్న కొనకళ్ల నారాయణరావు

కనకమేడలకు కొనకళ్ల పరామర్శ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

బైపాస్ సర్జరీ చేయించుకుని కోలుకుంటున్న రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రబాబును కృష్ణాజిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ పార్లమెంటు సభ్యులు కొనకళ్ళ నారాయణరావు, మాగంటి బాబు గురువారం హైదరాబాదులో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కనకమెడల రవీంద్రబాబుకు ఇటీవల హార్ట్ ఎటాక్ గురై హైదరాబాదులోనే హాస్పిటల్లో సర్జరీ చేయించుకున్న విషయం తెలిసిందే. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ ఈ సందర్భంగా సాయిబాబా చిత్రపటాన్ని ఆయనకు బహూకరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌భాషా, పక్కన జెసి అపరాజితసింగ్

వేగంగా గృహాల నిర్మాణం : కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లా ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలైన గృహ నిర్మాణం, రీ సర్వే, వ్యవసాయశాఖ కార్యక్రమాల ప్రగతి లక్ష్యాలు సాధించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి, సీసీఎల్ఎ సాయి ప్రసాద్ గురువారం జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో అమరావతి సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి రీ సర్వే, గహ నిర్మాణం, వ్యవసాయం, ఈ-క్రాఫ్ బుకింగ్, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు భూసేకరణ అంశాలపై సమీక్షించారు. జిల్లాలో రబీ ఈ-క్రాఫ్ బుకింగ్ 97 శాతం పూర్తయ్యిందన్నారు. వైఎస్సార్ యంత్రసేవ పథకం అమలుకు 80 శాతం కమ్యూనిటీ హైరింగ్ సెంటర్స్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఉద్యానవన పంటలు 200 హెక్టార్ల లక్ష్యానికి గాను 135 హెక్టార్లలో సాగునకు చర్యలు చేపట్టామన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం క్రింద జిల్లాలో ఇప్పటివరకు రీ సర్వే చేపట్టిన గ్రామాల్లో 103 గ్రామాల్లో సర్వే (13వ నోటిఫికేషన్) పూర్తయ్యిందన్నారు. 88 గ్రామాల్లో పట్టాలు జనరేట్ చేశామన్నారు. జిల్లాలో 93,245 గృహాలు మంజూరు కాగా ఇప్పటివరకు 9,512 పూర్తయ్యాయన్నారు. మిగతావి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. జగనన్న లే అవుట్లలో ఇప్పటిదాక పూర్తి అయిన 9,512 గృహాల్లో 88 శాతం త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, సర్వే ఎడి గోపాల్ రాజ్, డ్వామా పిడి జి.వి.సూర్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా, సమగ్ర శిక్ష ఏ పి సి శేఖర్, జిల్లా వ్యవసాయశాఖాధికారి మనోహరరావు, ఉద్యానవనశాఖాధికారిణి జె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పునే ఉపయోగించాలి : గీతాబాయి

పజాశక్తి - మచిలీపట్నం అర్బన్

కేవలం అయోడిన్ ఉండే ఉప్పును మాత్రమే ఉపయోగించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జి.గీతాభాయి అన్నారు. నేషనల్


వైద్య, ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న గీతాభాయి

అయోడిన్ డిఫిషిఎన్సి డిసార్డర్స్ కంట్రోల్ పోగ్రామ్ (ఎన్ఐడిడిసిపి) సర్వేలో భాగంగా గురువారం స్థానిక 33వ డివిజన్ అర్బన్ హెల్త్ సెంటర్, 37 వ డివిజన్ మున్సిపల్ స్కూలును ఎన్‌సిడి పరిశీలకులు చంద్రశేఖర్, సుస్మిత, జిల్లా ఎన్ సిడి సెల్ పోగ్రాం ఆఫీసర్ కె రత్నగిరి, డిఎంహెచ్ఒ డాక్టర్ గీతాభాయి పరిశీలించారు. పాఠశాలలో నిత్యం ఆహారంలో ఉపయోగించే ఉప్పులో ఆయోడిన్ కలిగి ఉన్నదానిపై సర్వే నిర్వహించారు. మున్సిపల్ స్కూలులోని 90 మంది పిల్లల సాల్ట్, యూరిన్ శాంపిళ్లను సేకరించారు. పరీక్షల నిమిత్తం స్టేట్ ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ 5 నుంచి 13 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలకు అయోడిన్ తప్పనిసరన్నారు. పిల్లల ఎదుగుదలలో అయోడిన్ ఎంతో అవసరమని తెలిపారు. రోజువారీ ఆహారంలో వాడే ఉప్పు మోతాదులో అయోడిన్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.వైదేహి, మున్సిపల్ స్కూల్ హెచ్ఎం పి.శశికళ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పమిడిముక్కల

అయోడిన్ ఉండే ఉప్పును మాత్రమే ఉపయోగిస్తే మంచిగా ఆరోగ్యంగా ఉండొచ్చునని వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పద్మజ అన్నారు. పమిడిముక్కల మండలంలోని కృష్ణాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యంపై అంచనా నిమిత్తం వైద్య పరీక్షలు చేశారు. అయోడిన్ ఉండే ఉప్పును వినియోగించటం ద్వారా వ్యాధులు రాకుండా చూడొచ్చునని డాక్టర్ అఖిల వివరించారు. 90 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్యం గురించి వివరించి మందులు పంపిణీ చేశారు. సిహెచ్ రమణి, సుబ్బారావు, సుమలత, జ్యోతి, అన్నామణి, పమిడిముక్కల, నారాయణపురం, ముసలినాయుడుపాలెం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పద్మజ

ఆర్‌టిసి డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు

జిల్లాలో ఐదు డిపోల నుండి18 మందికి అందజేత

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఆర్టీసీ బస్సు డిపో గ్యారేజీలో ఏర్పాటు చేసిన అభినందన సభలో జిల్లాలో సుదీర్ఘ కాలం ప్రమాద రహిత డ్రైవర్లుగా గుర్తింపు పొందిన 18 మందికి ప్రశంసాపత్రాలను అందచేశారు. ఈ సభకి


ప్రశంసాపత్రాలు అందుకున్న డ్రైవర్లతో ఆర్టీసీ అధికారులు, డిఎంలు

ముఖ్య అతిథిగా ఏఎస్పీ రామాంజనేయులు, విశిష్ట అతిథిగా జిల్లా రవాణా అధికారి పి.సీతాపతి, ప్రజా రవాణా అధికారి గద్దె నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రోడ్డు భద్రత, రహదారి నియమ, నిబంధనలు ప్రతి ఒక్క వాహనదారుడు తెలుసుకోవాలన్నారు. అప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమన్నారు. ప్రతి డ్రైవర్ సురక్షితంగా వాహనాన్ని నడపటంతో పాటు ఎదుటి వాహనాన్ని గమనించి నడిపినప్పుడు మాత్రమే రహదారి భద్రత సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఐదు డిపోల నుండి ఎంపిక చేయబడిన అత్యధిక ప్రమాద రహిత సర్వీస్ కలిగిన సీనియర్ డ్రైవర్లను నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, బహుమతులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని డిపో మేనేజర్లు, అధికారులు, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కొత్తపేట గ్రామానికి చెందిన ఎర్రబర్ల శ్రీనివాసరావు పావని దంపతులు రూ.15 వేలు విలువ చేసే క్రీడా పరికరాలను


ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న శ్రీనివాసరావు పావని దంపతులు

బహుకరించారు. శ్రీనివాసరావు పావని దంపతులు హైదరాబాద్‌లో పలు విద్యాసంస్థలు నడుపుతూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం అవనిగడ్డలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన వీరు పాఠశాల ఉపాధ్యాయుల కోరిక మేరకు క్రీడా పరికరాలను కొనుగోలు నిమిత్తం ఈ నగదును అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ భవిష్యత్తులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మరిన్ని సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎన్.శివ శంకరరావు, ప్రధానోపాధ్యాయులు ఎ.వెంకటేశ్వరరావు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ గుడిసె విష్ణు ప్రసాద్, పిడి ఉదయ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్ఎ డివై దాస్ పరామర్శ

ప్రజాశక్తి - మొవ్వ

మొవ్వ మండలం గూడపాడుకు చెందిన చిలుమూరి రమేష్ గుండెపోటుతో ఇటీవల ఆకస్మికంగా మృతిచెందారు. మృతుని కుటుంబ సభ్యులను గురువారం పామర్రు మాజీ ఎంఎల్ఎ డి వై దాసు పరామర్శించారు. రమేష్ అకాల మరణం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.


పరామర్శిస్తున్న డివై దాస్



రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో గురువారం పోలీసు డైరీని ఆవిష్కరిస్తున్న రైల్వే డీజీ కుమార్ విశ్వజిత్, చిత్రంలో గుంతకల్ రైల్వే డివిజన్ ఏపీ స్టేట్ పోలీస్ వైస్ ప్రెసిడెంట్ వి.జగన్మోహన్ రెడ్డి తదితరులు

పోలీస్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ

రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో గురువారం రైల్వే డీజీ కుమార్ విశ్వజిత్ 2023 సంవత్సర పోలీస్ డైరీని ఆవిష్కరించారు. గుంతకల్ రైల్వే డివిజన్ ఏపీ స్టేట్ పోలీస్ వైస్ ప్రెసిడెంట్ వి.జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్మోహనరెడ్డి మాట్లాడుతూ గుంతకల్ రైల్వే డివిజన్ ఎస్పి చౌడేశ్వరి సహకారంతో డివిజన్లోని పోలీసులందరికీ ఈ డైరీని పంపిణీ చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎపి స్టేట్ పోలీస్ ప్రెసిడెంట్ జనకుల శ్రీనివాస్, గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, సిఐడి ప్రెసిడెంట్ అక్కిరాజు, రైల్వే డిజి మేనేజర్ షఫీ పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో తండ్రీ కుమార్తె దుర్మరణం

ప్రజాశక్తి - విజయవాడ : విద్యుత్ షాక్‌కు గురై తండ్రి, కుమార్తె మరణించారు. ఈ విషాద సంఘటన విజయవాడ సత్యనారాయణపురంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సత్యనారాయణపురం రామకోటి వద్ద ఇప్పిలి సింహాచలం (60), అతని కుమార్తె పసుపులేటి మంగమ్మ (32), ఆమె భర్త గోపీనాథ్ నివాసముంటున్నారు. గతంలో సిమెంట్ పని చేసుకుని జీవనం సాగించిన సింహాచలం...తన ఇంట్లో బకెట్లో నీళ్లు కాసుకునేందుకు హీటర్ వేశాడు. అయితే హీటర్‌ను తాకడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఆయన కుమార్తె మంగమ్మ ఆయనను పక్కకు లాగే ప్రయత్నం చేసింది. దీంతో ఆమె కూడా విద్యుత్ షాక్‌కు గురైంది. ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. పక్కనే నివాసముంటున్న లక్కవరపు సీత అనే మహిళ వారిని కాపాడేందుకు ప్రయత్నించి ఆమె



కూడా స్వల్పంగా గాయపడింది. క్షతగాత్రులను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. సింహాచలం, మంగమ్మ మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. మంగమ్మ ఇద్దరు పిల్లలు ఉన్నారు. సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలోత్సవ్‌లో మెరిసిన రిజోనెన్స్ విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - విజయవాడ

అమరావతి బాలోత్సవ్ నిర్వహించిన 5వ పిల్లల పండుగలో వివిధ విభాగాలలో బహుమతులు పొందిన విద్యార్థులను రిజోనెన్స్ స్కూల్ (శిఖర) ప్రిన్సిపాల్ బండ్ల మాధవరావు అభినందించారు. తెలుగు పండిట్ జానీ ఆధ్వర్యంలో పాఠశాల నుండి పాల్గొన్న వారిలో జ్యోత్స్న, హదస్సా ప్రథమ బహుమతులు, అమీర్, ప్రవీణ్ ద్వితీయ బహుమతులు, కౌశిక్, వర్షిత్, వివేక్, ఆనందిని, సుమయ తతీయ బహుమతులు పొందారు. పిల్లల్లో దాగివున్న సజనను వెలికితీయడానికి బాలోత్సవ్ చేస్తున్న కషి శ్లాఘనీయమని, ఎన్నో వ్యయప్రయాసలకోర్చి నిర్వహిస్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలుపుతున్నానని మాధవరావు పేర్కొన్నారు.



అమరావతి బాలోత్సవ్ నిర్వహించిన 5వ పిల్లల పండుగలో వివిధ విభాగాలలో బహుమతులు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న రిజోనెన్స్ స్కూల్ (శిఖర) ప్రిన్సిపాల్ బండ్ల మాధవరావు

అమరావతి జెఎసి రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - విజయవాడ

ఈనెల 5న కర్నూల్‌లో జరిగే ఏపీ జెఎసి అమరావతి మూడవ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంటాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ విజయవాడ సిటీ చైర్మన్ జగదీశ్ బాబు, రాష్ట్ర జెఎసి చైర్మన్ సుమన్ పిలుపునిచ్చారు. గురువారం వారు ఒక ప్రకటన చేస్తూ రాష్ట్రంలోని కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.

మొదటి పేజీ తరువాయి



పనులను పరిశీలిస్తున్న శ్రీలక్ష్మి

ఏప్రిల్లో 125 అడుగుల అంబేద్కర్ కాంస్య విగ్రహ ప్రతిష్టాపనకు ఏర్పాట్లు

మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు ఈ పనులను పరిశీలించినట్లు చెప్పారు. నాణ్యతా ప్రమాణాలపై కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేసినట్లు చెప్పారు. అంబేద్కర్ స్మృతివనం నిర్మాణ వ్యయం రూ.286 కోట్లని, ఈ స్మృతివనంలో ప్రత్యేకంగా 2 వేల మందికి సరిపోయే ఆడిటోరియం, 500 మంది సామర్థ్యంతో కూడిన ఓపెన్ థియేటర్, ధ్యాన మందిరం నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. విజయవాడ కంట్రోల్ రూమ్ సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహం నుండి ఎంజి రోడ్డులో బెంజిసర్కిల్ వరకు గల సుమారు ఎనిమిది కిలోమీటర్ల ప్రాంతాన్ని రోడ్డుకిరువైపులా ఆకర్షణీయమైన ఫుట్‌పాత్‌లు, టైల్స్‌తో సుందరీకరించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి రోజున ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి 125 అడుగుల అంబేద్కర్ కాంస్య విగ్రహ ప్రతిష్టాపనకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ పరిశీలనా కార్యక్రమంలో ఎపిఐఐసి విసి, ఎమ్‌డి సజన, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎపిఐఐసి ఇంజనీర్ ఇన్ చీఫ్ పాల్గొన్నారు.

గన్నవరం వైసిపిలో గరం..గరం...

వెంకట్రావ్ వ్యాఖ్యానించినట్లుగా చెబుతున్న వీడియో వైరల్ అవుతోంది.

ఈ వ్యాఖ్యలపై డాక్టర్ వంశీ తీవ్రంగా స్పందించారు. వైసిపిలో తనతో కలిసి పని చేసే అదష్టం దుట్టా, యార్లగడ్డకు లేదన్నారు. "దుట్టా కుమారుడికి, అల్లుడికి మేము పనిచేయాలి, ఆయన కుమార్తెను ఉంగుటూరు జడ్‌పిటిసిగా నేను గెలిపించాను, అప్పుడు వంశీకి పని చేయను" అని దుట్టా చెప్పలేదన్నారు. అల్లుడూ నోరు తెరవలేదన్నారు. తనపై, కొడాలి నానిపై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వలస పక్షులు, గూట్లో పక్షులు అని వ్యాఖ్యానిస్తే పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. తాను ఎక్కడా అవినీతికి పాల్పడి అక్రమాస్తులు సంపాదించలేదన్నారు. విజయవాడ ఎంపి, గన్నవరం ఎంఎల్‌ఎ స్థానాలకు పోటీ చేసినప్పుడు ఎన్నికల అఫిడవిట్లో తన మొత్తం ఆస్తుల వివరాలు వెల్లడించానని వంశీ పేర్కొంటూ వారిని దుర్భాషలాడారు. తన గురించి, కొడాలి నాని గురించి పిచ్చి పిచ్చిగా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వాళ్ల మాదిరిగా దొంగ ఆపరేషన్లు చేసి తాను ఎక్కడా డబ్బులు వసూలు చేయలేదన్నారు. ప్రజా బలం లేనివారు సమావేశాలు పెట్టుకుంటారని, ఆ నేతల వ్యాఖ్యలను పట్టించుకోనని అన్నారు. వారు కోట్ల రూపాయలు సంపాదించి పిల్లల కోసం దాచుకుంటున్నారని, తాను సంపాదించిన దాంట్లో అధిక శాతం గన్నవరం నియోజకవర్గంలోని పేదలే ఖర్చు చేస్తున్నానని స్పష్టంచేశారు. కొడాలి నాని నాలుగు సార్లు, తాను రెండుసార్లు ఎంఎల్‌ఎలుగా గెలిచామని గుర్తుచేశారు. వారు ఒక్కసారైనా ప్రజాక్షేత్రంలో గెలిచారా అని ప్రశ్నించారు. తాను నిత్యం ప్రజల్లో ఉంటానని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకే తాను నియోజకవర్గంలో పనిచేసుకుంటూ పోతున్నానని పేర్కొన్నారు. ఎనిమిదేళ్ల క్రితం దుట్టా, మూడున్నరేళ్ల క్రితం యార్లగడ్డ అసెంబ్లీ ఎన్నికల్లో తనపై పోటీ చేసి ఓడిపోయిన వారేనని అన్నారు. వారిద్దరినీ ప్రజలు తిరస్కరించారన్నారు.

ఈ వ్యవహారంపై హనుమాన్ జంక్షన్లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ వైసిపి సీనియర్ నాయకులు దుట్టా రామచంద్రరావు మాట్లాడుతూ గుడి ప్రారంభోత్సవం నిమిత్తం యార్లగడ్డ, తాను కలుసుకున్నామన్నారు. కొన్ని చానళ్లల్లో సిఎం జగన్ సైకో తామిద్దరం అన్నట్లుగా చూపడాన్ని ఖండించారు. తాముఆ విధంగా అనలేదన్నారు. నలభై ఏళ్ల నుండి తాను డాక్టర్ వత్తిలో ఉన్నానని, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి కుటుంబానికీ, తమకూ దగ్గర సంబంధం ఉందని అన్నారు. తాను, తమ కుటుంబ సభ్యులు చనిపోయే వరకూ జగన్‌తోనే ఉంటామన్నారు. వల్లభనేని వంశీతో కలిసి పనిచేయాలని అధిష్టానం చెప్పిందని, అయితే వంశీతో కలిసి తాను పనిచేయలేనని అధిష్టానానికి చెప్పానని అన్నారు. వంశీతో గొడవ పడొద్దని అధిష్టానం తనకు చెప్పిందని, అధిష్టానం మాటకే తాను కట్టుబడి ఉన్నానని అన్నారు. యార్లగడ్డ వెంకట్రావు కూడా వైసిపి అధిష్టానికి కట్టుబడి ఉన్నారని అన్నారు. సిఎం జగన్‌ను తిట్టే మనస్తత్వం తమదికాదన్నారు. అందరం సరదాగా కూర్చుని మాట్లాడుకునే సమయంలో ఎవరు రికార్డ్ చేశారో తెలియదని, ఆ వీడియోలో అనకూడని మాటలేమీ లేవని దుట్టా పేర్కొన్నారు. ఈ వీడియోపై ఇంకా వైసిపి నాయకులు యార్లగడ్డ వెంకట్రావు స్పందించాల్సి ఉంది.

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు జిజిహెచ్‌లో ప్రత్యేక ఒపి కౌంటర్ ప్రారంభం

వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రక్తపోటు, హైపర్ థైరాయిడిజం, రుమటాయిడ్ ఆర్థరైటిస్, కన్వల్షివ్ డిజార్డర్, ఇన్ఫ్లమేటరీ ప్రేగు వ్యాధి, సైకోసిస్, ఆస్టియో ఆర్థరైటిస్, సోరియాసిస్, కార్డియాక్ ఫెయిల్యూర్, నెఫ్రోటిక్ సిండ్రోమ్, క్రానిక్ కిడ్నీ వంటి దీర్ఘకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి కార్పొరేట్ వైద్య సహాయం అందించనున్నట్లు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, ఇహెచ్‌ఎస్ అమలు కమిటీ సభ్యులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ ఉద్యోగుల పే స్కేల్ ఆధారంగా ఒక్కొక్కరి నుండి రూ.225, రూ.300 ఇహెచ్‌ఎస్ స్కీంకు కాంట్రిబ్యూషన్ కింద ప్రభుత్వానికి చెల్లిస్తున్నట్లు తెలిపారు. అనారోగ్యానికి గురైన ఉద్యోగులు వైద్య పరీక్షల నిమిత్తం వ్యాధి నిర్ధారణకు ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లను ఆశ్రయించడం ద్వారా వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చేదన్నారు. ఈపరిస్థితిని నివారించాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నాయకులు ముఖ్యమంత్రి దష్టికి తీసుకువచ్చారని,దీనిపై స్పందించిన ఆయన ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ విభాగాన్ని ఏర్పాటు చేసి వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించే ఏర్పాటు చేశారని అన్నారు. ఇలా ఏర్పాట్లు చేసినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఢిల్లీరావు, విద్యాసాగర్‌కు ప్రభుత్వాస్పత్రి వైద్యులు డాక్టర్ వెంకటరామయ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ జె.సుమన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్య లక్ష్మి, ఆర్ఎంవోలు మంగాదేవి, శోభారాణి, సిద్దార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విఠల్ రావు, ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నాగేశ్వరరావు, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ప్రతినిధులు ఎండి ఇక్బాల్, సిహెచ్ శ్రీరామ్, కె.సంపత్ కుమార్, కె.శివలీల, ఆరోగ్య మిత్రాలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



బిపి పరీక్ష చేయించుకుంటున్న కలెక్టర్

పార్లమెంట్‌కు రవిదాసు పేరు పెట్టాలి : దండు

గుడివాడ : నూతనంగా నిర్మించిన ఢిల్లీ పార్లమెంట్ భవనానికి సంతు రవిదాస్ పేరును నామకరణం చేయాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక శోభన కాన్ఫరెన్స్ హాల్‌లో ఏపీ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 900 సంవత్సరాల క్రితం భారతదేశంలో మృతి చెందిన పశువుల చర్మాలను శుద్ధిచేసి మనుషులకు ఉపయోగపడే పలు వస్తువులను తయారు చేయడమే కాకుండా డప్పు వాయిద్యాలు తయారుచేసిన కళా నైపుణ్యుడు సంత రవిదాస్ అన్నారు. మన దేశంలో చర్మకారి కుటుంబంలో 13వ దశాబ్దంలో జన్మించిన సంతు రవిదాస్ జన్మదినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కంచర్ల సుధాకర్, వెంపటి సైమాన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు స్టాఫర్లు దోహదం : సిఐ

గుడివాడ : జిల్లా ఎస్‌పి జాషువా ఆదేశాల మేరకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా గుడివాడ పట్టణంలోని శ్రీజ వెడ్డింగ్ షాపింగ్ మాల్ యాజమాని అనిల్ టుటౌన్ పోలీసు స్టేషన్‌కు 10 ట్రాఫిక్ స్టాపర్లు అందించడం అభినందనీయమని టూటౌన్ సిఐ తులసీధర్ అన్నారు. బుధవారం ఈ మేరకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా షాపింగ్ మాల్ యజమాని అనిల్ కుమార్, మేనేజర్ కుమార్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు 10 ట్రాఫిక్ స్టాపర్లు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

మొవ్వ : ద్విచక్ర వాహన చోధకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కూచిపూడి పోలీసులు సూచించారు. గురువారం మొవ్వ మండలం నిడుమోలు జాతీయ రహదారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన చోదకులకు హెల్మెట్ ధారణ, ఫోర్ వీలర్ వాహనాల్లో సీట్ బెల్ట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, రహదారి భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

నాగరాజుకు ఘన సత్కారం

ప్రజాశక్తి-గన్నవరం

కృష్ణాజిల్లాలో ఉత్తమ జాతీయ ఫెన్సింగ్ క్రీడాకారులను తీర్చిదిద్దుతున్న గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు ధనియాల నాగరాజును ఘనంగా సన్మానించారు. 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14,17 అంతర్‌జిల్లాల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ కర్నూలు టోర్నమెంట్లో ఈ సత్కారం జరిగింది. కర్నూలు జిల్లా విద్యాశాఖ ఏడి సామ్యూల్, ప్రముఖ రచయిత దేవిల ధనియాల నాగరాజును దుశ్శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించి, ప్రశంసించారు. జిల్లాలో గత 10 సంవత్సరాల నుంచి ఉత్తమ ఫెన్సింగ్ క్రీడాకారులను తీర్చిదిద్ది జాతికి అందిస్తున్న ధనియాల నాగరాజు, ఆయన సేవలను రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫెన్సింగ్ పోటీల పరిశీలకులు నిత్య ప్రభాకర్, పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మయ్య ,కర్నూలు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి జి.రవి తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాలు పంపిణీ

గుడివాడ : స్థానిక భాస్కర్ థియేటర్ సమీపంలోని భవిత కేంద్రంలోని వికలాంగుల పాఠశాలలో జగనన్న విద్యా కానుకలో భాగంగా ఉపకరణాల పంపిణీ నిర్వహించారు. బుధవారం ఈ సందర్భంగా ఎంపిపి గద్దె పుష్పరాణి, జెడ్పీటీసీ సభ్యుడు గొల్ల రామకృష్ణ, ఎంఇఒ జి.శేఖర్‌లు 7 వీల్‌ఛైర్లు, రెండు సిపి ఛైర్స్, హియరింగ్ మిషిన్ సెట్టును అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్ర నిర్వహకులు ఎం.కె.నీలాంబరం, రాములు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం ప్రజా సంక్షేమమే ధ్యేయం : వంశీ

ప్రజాశక్తి-గన్నవరం (హనుమాన్ జంక్షన్)

తాను ఏ పని చేసినా దాని వెనుక ప్రజా ప్రయోజనం ఉంటుందనీ, అందుకే ప్రజలు తనను ఎప్పుడూ ఆదరిస్తూనే ఉంటారని ఎమ్మెల్యే వంశీ చెప్పారు. బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్

సచివాలయం 2 పరిధిలోని హనుమాన్ నగర్‌లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు వివిధ పథకాలు ద్వారా లబ్ధిపొందిన వివరాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందించారు. స్థానిక ఆంజనేయ స్వామి గుడి రోడ్డులో డ్రైనేజ్ సమస్య ఉందని స్థానికులు ఎమ్మెల్యే వంశీ దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన వెంటనే పరిష్కరించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో డ్రైనేజీతో పాటు పలు లింక్ రోడ్లను సిమెంట్ రోడ్లుగా నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వంశీ మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేసిన వారే ప్రజా నేతలుగా గుర్తించబడతారని సీఎం జగన్ చెప్పారని, ఆయన చూపిన బాటలోనే తాను ముందుకు నడుస్తున్నట్లు తెలిపారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన లెక్కచేయకుండా ముందుకు వెళ్తానన్నారు. పేద ప్రజల ఆశయాలను, ఆకాంక్షలను తీర్చేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి వెళ్తున్న సమయంలో కొంతమంది సమస్యలు చెబుతున్నారని వాటిని నమోదు చేసుకుని త్వరలోనే పరిష్కరించటం ద్వారా వారి కళ్లల్లో ఆనందం చూస్తానన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ సరిపల్లి కమలా కిరణ్, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ కొమరవల్లి గంగా భవాని, మండల వైసిపి అధ్యక్షుడు నక్కా గాంధీ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ తనిషా, ఎంపీటీసీ వడకల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా వాహనాలు నడపాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

ఒక క్షణం చిన్న ఏమరపాటు మనపై ఆధారపడిన కుటుంబాన్ని రోడ్డుపాలు చేస్తుందని జిల్లా ఎస్పీ పి జాషువా అన్నారు. రోడ్డు ప్రమాదాలు నియంత్రణలో భాగంగా నెల రోజుల నుండి జిల్లావ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొంచెం దూరమే కదా అని ద్విచక్ర వాహనంపై హెల్మెట్‌ను, నాలుగు చక్రాల వాహనాల్లో సీటు బెల్ట్ విస్మరిస్తే తిరిగి కోలు కోలేనంత భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. జిల్లావ్యాప్తంగా హెల్మెట్, సీట్ బెల్ట్, రహదారి భద్రతా ప్రమాణాలు విస్మరించిన వారిపై నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 8888 కేసుల నమోదయ్యాయన్నారు. హెల్మెట్ లేని 3200, సీట్ బెల్ట్ ధరించని 60, డ్రంక్ అండ్ డ్రైవ్ 182 కేసులు నమోదయ్యాయని చెప్పారు. మితిమీరిన వేగం, నిర్లక్ష్య పూరిత వాహన డ్రైవింగ్ ఎల్లవేళలా ప్రమాదకరమని తెలిపారు. మొదటిసారి హెల్మెట్, సీట్ బెల్ట్ లేని వాహనదారులకు జరిమానా ఉండదన్నారు. వాహనాలను సీజ్ చేసి, హెల్మెట్ తెచ్చుకున్న తర్వాత వాహనాలను తిరిగి అందజేయడం చేస్తున్నామని తెలిపారు. మద్యం సేవించి, సెల్ఫోన్ మాట్లాడుతూ మితిమీరిన వేగంతో నడుపుతున్న వారిని ఆపి చర్యలకు ఉపక్రమిస్తున్నామని వివరించారు. గత నెల రోజులుగా నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో మొత్తం 182 కేసులలో రూ.2,10,300 జరిమానా విధించామన్నారు.

బందరు ప్రభుత్వాస్పత్రిలో సినీ ఫక్కీలో చోరీ

మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో గురువారం సినీ ఫక్కీలో చోరీ జరిగింది. నగరంలోని ఒక బంగారు దుకాణానికి ఫోన్ చేసి తాను వైద్యుడునని, తన భార్యకు ఖరీదైన నెక్లెస్ కావాలని తెలిపాడు. కొన్ని ఖరీదైన మోడళ్లను ఆస్పత్రి వద్దకు తీసుకు వస్తే నగదు చెల్లిస్తానంటూ వ్యాపారి కోరాడు. ఫోన్‌కాల్ తో సుమారు 18 గ్రాముల బంగారు నక్లెస్‌ను బ్యాగులో పెట్టుకుని హాస్పిటలుకు వ్యాపారి కార్తీక్ చేరుకున్నాడు. అతని నుంచి నెక్లెస్ తీసుకుని డబ్బు తెచ్చి ఇస్తానంటూ వేరే గదిలోకి వెళ్లిన వైద్యుడి గెటప్‌లో ఉన్న నిందితుడు ఎంతకీ తిరిగి రాకపోవడంతో వ్యాపారి తలుపు తట్టాడు. అయినా గదిలోకి వెళ్ళిన వ్యక్తి ఎంతకి తిరిగి రాకపోవడంతో వ్యాపారి మరింత అనుమానంతో తలుపుపై భాగం నుంచి గదిలోకి చూడగా ఎవ్వరూ లేరు. గదిలోని కిటికీ గోడ పగలగొట్టి ఉండడంతో మరింత అనుమానం కలిగి పోలీసులను ఆశ్రయించాడు. ఎస్‌పి జాషువా ఆదేశాల మేరకు బందరు డిఎస్పి మాసూం భాష పర్యవేక్షణలో సిసి పుటేజ్‌లను పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయం చేయాలని ధర్నా

గుడివాడ : ఓ మహిళ తనను ఇల్లు కట్టుకోనీకుండా ఇబ్బందులకు గురి చేస్తోందనీ, తనకు న్యాయం చేయాలని గుడివాడ పంచవటి కాలనీ కాలవ గట్టుపై నివాసం ఉంటున్న ఉపతల ఏడుకొండలు అధికారులను కోరారు. గురువారం సచివాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ ఇల్లు కట్టుకోవడానికి పూరిల్లు ఊడదీసి కొలతలు వేసుకుంటూ ఉంటే పక్కనే నివాసం ఉంటుంది వేంద్ర జ్యోతి అనే మహిళ తనని ఇల్లు కట్టుకోనీకుండా ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపతల బుజ్జి, గుంజా రాణి, యు లక్ష్మి , బి యు జమలయ్య, శ్రీను , నాగన్న, ఏసు , కామేసు తదితరులు పాల్గొన్నారు

ప్రజాస్వామ్యానికి రక్షణ కల్పించండి : నాగరాజన్

ప్రజాశక్తి-ఉయ్యూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యానికి పరిరక్షణ కల్పించాలని కోరుతూ గాంధీ దీక్షతో యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్ఆర్ గాంధీ నాగరాజన్ తెలిపారు. గాంధీ యాత్రలో భాగంగా గురువారం ఉయ్యూరు వచ్చిన ఆయన కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. ముందుగా పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి, అంబేద్కర్ నగర్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక బిల్డింగ్ నుండి పాత స్టేట్ బ్యాంకు రోడ్డు మీదుగా ప్రధాన రహదారి గుండా, ఉయ్యూరు వీరమ్మ తల్లి ఆలయం వరకు శిష్యులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని భగ్నం చేసేలా పరిపాలన సాగిస్తున్నాయని ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వ పాలనతో దేశ ప్రజలు అన్నింటా నష్టపోతున్నారన్నారు.

విదేశీ విద్యాదీవెనకు 11 మంది ఎంపిక

కలెక్టరేట్ (కృష్ణా) : జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి జిల్లాలో 11 మంది ఎంపికయ్యారని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గురువారం వెలగపూడి నుంచి రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.జయలక్ష్మి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. మచిలీపట్నంలోని కలెక్టరేట్ చాంబర్ నుంచి కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.రంజిత్ భాష మాట్లాడుతూ శుక్రవారం ప్రారంభమయ్యే జగనన్న విదేశీ విద్యా పథకం కోసం జిల్లాలో దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన విద్యార్థుల దరఖాస్తులు స్క్రూట్నీ అనంతరం జిల్లాలో ఎంపికైన అభ్యర్థుల వివరాలు, తదుపరి కార్యాచరణ ప్రణాళిక పై ముఖ్య కార్యదర్శి ఆదేశాలు ఇచ్చారన్నారు. జిల్లాలో ఇద్దరు బిసిలు, 6 గురు ఈబీసీలు, ముగ్గురు కాపు సామాజిక తరగతికి చెందిన విద్యార్థులను ఎంపిక చేశామని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారిణి కె.సరస్వతి, బిసి వెల్ఫేర్ డిడి లక్ష్మీదుర్గ, జిల్లా ట్రైబల్ సంక్షేమ అధికారి ఎం.ఫణి ధూర్జటి పాల్గొన్నారు.

4న జడ్‌పి స్థాయి సంఘ సమావేశాలు

కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు శనివార ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని జెడ్పీ ఇన్‌ఛార్జి సిఇఒ. జి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 7 వరకూ అన్ని స్థాయి సంఘ సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. సమావేశాలకు ఆయా సంఘాల అధ్యక్షులు అధ్యక్షతన నిర్వహిస్తారని తెలిపారు.

8న కమిషన్ ముందు హాజరుకండి : రాజా

ఉయ్యూరు : కృష్ణాజిల్లా జిల్లా రిజిస్ట్రార్ పి.ఉపేంద్రరావు రెండు వారాల్లో సమాచారం ఇచ్చి, ఈనెల ఎనిమిదో తేదీన స్వయంగా కమిషనర్ ముందు హాజరు కావాల్సిందిగా రాష్ట్ర సమాచార కమిషనర్ ఐలాపురం రాజా ఉత్తర్వులు జారీచేశారు. ఉయ్యూరుకు చెందిన స.హ. చట్టం కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ జిల్లా రిజిస్ట్రారు కార్యాలయాన్ని సమాచారం కోరగా, ఇవ్వనందున సమాచార కమిషనర్ పై ఉత్తర్వులను జారీచేశారు.జిల్లా రిజిస్ట్రారు కార్యాలయం పరిధిలో తప్పుడు రిజిస్ట్రేషన్లు, దస్తావేజులపై వచ్చిన ఫిర్యాదులు, వాటిపై నమోదు చేసిన క్రిమినల్ కేసుల సమాచారాన్ని శ్రీనివాసగౌడ్ కోరారు. సమాచారం ఇవ్వనందున రాష్ట్ర సమాచార కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లాలో అనేక సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో స్థిరాస్తుల యజమానులకు తెలియకుండానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నందున, ఫిర్యాదులపై రిజిస్ట్రేషన్ యాక్ట్ లోని సెక్షన్ 81, 82, 83 ప్రకారం జిల్లా రిజిస్ట్రారు చర్యలు తీసుకోవాల్సి వుంది. అలా జరగనందున జిల్లా రిజిస్ట్రారును రాష్ట్ర సమాచార కమిషనర్ ముందు ఈనెల ఎనిమిదోతేదీన స్వయంగా హాజరు కావాల్సిందిగా ఉత్తర్వులు జారీచేశారు.

నేడు ఉషారామా కళాశాలలో జాబ్ మేళా

గన్నవరం (ఉంగుటూరు) : గన్నవరం నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకుగాను ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ ఆధ్వర్యంలో ఏపీ ఎస్ఎస్‌డిసి, సీడ్ ఏపీ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్‌ల సంయుక్త భాగస్వామ్యంతో తేలప్రోలు గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ రహదారి వెంబడి ఉన్న ఉషారామా ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం జాబ్‌మేళా ఏర్పాటుచేశారు. ఈ మేరకు గన్నవరం ఎమ్మెల్యే వంశీమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఈ జాబ్‌మేళా జరుగుతుందని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు ఏదేనా విద్యార్హత కలిగిన నిరుద్యోగులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాకు చెందిన అనేక కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్హతలను బట్టి అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని పేర్కొన్నారు.

మత్స్యశాఖకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి

నాగాయలంక : మత్స్యకారుల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తోందని ఏపి సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు విమర్శించారు. గురువారం ఆయన నాగాయలంకలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మత్స్యశాఖకు ప్రత్యేకంగా నిధులు కేటాయించకుండా మత్స్యశాఖ, ఫిషరీస్, పశుసంవర్ధక, పరిశ్రమల శాఖలకు కలిపి బడ్జెట్లో నిధులు కేటాయిస్తున్నారన్నారు. సంప్రదాయ మత్స్యకారులకు కేంద్రం మొండి చేయి చూపిస్తోందని విమర్శించారు.

విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన అవసరం

వరంగల్ ఎన్ఐటి ఫిజిక్స్ ప్రొఫెసర్ హరినాథ్

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన అవసరమని వరంగల్‌లోని ఎన్ఐటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ డి.హరినాథ్ సూచించారు. సిద్ధార్థ కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం సిద్ధార్థ ఆడిటోరియంలో సెన్టెల్లా-4.0 పేరుతో సాంకేతిక, సాంస్కృతిక అంశాల్లో విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. హరినాథ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుందని, ఇలాంటి వేదికల్లోనే ఆ నైపుణ్యాలు బహిర్గతం అవుతాయన్నారు. సాంకేతికంగా వస్తున్న మార్పులను విద్యార్థులు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకుంటూ ప్రతిభ చాటేందుకు సన్నద్ధం కావాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సజనాత్మకతను పెంపోందించడానికి ఇలాంటి కార్యక్రమాలను తమ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మేకా రమేష్, డీన్ రాజేష్ సి జంపాల మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులు ఒకరి ఆలోచనలను మరొకరు పంచుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఫిజిక్స్ విభాగాధిపతి టి.శ్రీనివాసకృష్ణ మాట్లాడుతూ కేవలం కళాశాల స్థాయి విద్యార్థులకే కాకుండా హైస్కూల్ స్థాయిలోని విద్యార్థులకు కూడా ఫిజిక్స్‌పై మక్కువ పెంచడానికి సెన్టెల్లా-4.0లో పోటీలను నిర్వహించామన్నారు. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు కళాశాల, పాఠశాల స్థాయి వేర్వేరుగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు



తయారు చేసిన ప్రయోగాల నమూనాల ప్రదర్శన (ఐస్), క్విజ్, రెప్లికా పోటీలతో పాటుగా రోల్ పే పేరుతో విద్యార్థులు ప్రముఖ సైటిస్ట్ వేషధారణలో అలరించారు. గెస్ ఇట్, జస్ట్ ఏ మినిట్, పోస్టర్ ప్రజంటేషన్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారిలోని ప్రతిభను చూపారు. మధ్యాహ్నం నుంచి నృత్యాలు, సింగింగ్, ట్రెజంట్, స్పాట్ ఫొటోగ్రఫి, జస్ట్ ఏ మినిట్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు.



హ్యాండ్‌బాల్ టోర్నీకి జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయవాడరూరల్: తమిళనాడు సేలంలోని పెరియార్ యూనివర్సిటీలో ఈ నెల 4 నుంచి 8 వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల హ్యాండ్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొనేందుకు కృష్ణా యూనివర్సిటీ పురుషుల హ్యాండ్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు గురువారం విజయవాడ నుంచి సేలం బయలుదేరి వెళ్లింది. ఈ సందర్భంగా విజయవాడ సమీపంలోని నున్న వికాస్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో వికాస్ విద్యాసంస్థల కార్యదర్శి నరెడ్ల సత్యనారాయణరెడ్డి క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా విశ్వవిద్యాలయం క్రీడలు, ఆటలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వికాస్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ జి రాజు, వైస్ ప్రిన్సిపాల్ బి ఉదయ్ కుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్లు పి బాలాజీ, టి హనుమంతరావు పాల్గొన్నారు.

ఫ్యాషన్ రంగంలోకి ఆదిత్య బిర్లా

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్‌లోకిప్రవేశించినట్లు సంస్థ చైర్మన్ కుమార్ మంగళం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు సేవలను అందించడంలో ఆదిత్య బిర్లా సంస్థ ముందుంటుందని తెలిపారు. ఇందులో భాగంగానే సంస్థ బోర్డు డైరెక్టర్లుగా అనన్య బిర్లా, ఆర్యమన్ విక్రమ్‌లను తీసకున్నట్లు తెలిపారు. వీరు సంస్థ వ్యాపార లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లనున్నారని తెలిపారు.

మైలవరంలో 'నరకాంక్ష' షూటింగ్

ప్రజాశక్తి:మైలవరం: మైలవరంలో నరకాంక్ష సినిమా షూటింగ్ ప్రారంభమైంది. స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి క్రీడా ప్రాంగణంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సినీ నటులు, రంగస్థల కలాకారులు వీరంకి వెంకట నరసింహారావు క్లాప్ కొట్టగా తొలి షాట్‌ను చిత్రీకరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నాని మాట్లాడుతూ ప్రముఖ దర్శకుల వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశానని, మొదటి చిత్రంగా వశం తీసానని, రెండవ చిత్రంగా నరకాంక్షను తీస్తున్నామన్నారు. గ్రామీణ నేపథ్యంలో సస్పెన్స్ థ్రిల్లర్‌గా సాగే సినిమా మైలవరంలోని పరిసర ప్రాంతాలలో నెల రోజుల పాటు చిత్రీకరిస్తామన్నారు. యదార్ధ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తీయడం జరుగుతుందన్నారు. ఎంగోటి శశికుమార్‌రెడ్డి హీరోగా, శిరీషారెడ్డి హీరోయిన్‌గా రవి, నారాయణరావు నిర్మాతలుగా ఆర్‌ఆర్ బ్యానర్‌పై చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

జాకీర్ హుస్సేన్ కళాశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: జనవరి 30 నుండి ఫిబ్రవరి 1 వరకు ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలోని ఉక్కు కళావేదికలో (అండర్ 19 విభాగంలో) నిర్వహించిన అంతర్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో తమ కళాశాల విద్యార్థి తెల్లగడ్డ



భరత్ బంగారు పతకం కైవసం చేసుకున్నట్లు డాక్టర్ జాకీర్ హుస్సేన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ మహాభాష తెలిపారు. కళాశాల ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న భరత్ 158 కిలోల బరువును ఎత్తి బంగారు పతకం సాధించారన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి.హమీద్‌ఖాన్ పర్యవేక్షణలో వివిన్ రాజశేఖర్ కోచ్‌గా వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జాఫర్ సాదిక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మస్తాన్‌వలీ, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

సచివాలయాలను తనిఖీ చేసిన జెసి



సచివాలయ సిబ్బందిని ప్రశ్నిస్తున్న జెసి

ప్రజాశక్తి-వన్‌టౌన్ : ప్రజా సంక్షేమ పథకాలను పారదర్శకంగా ప్రజలకు అందించడంతో పాటు సమస్యలను సత్వర పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ సచివాలయ సిబ్బందినీ ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధి విజయవాడ పశ్చిమ మండలంలోని కుమ్మరిపాలెం, హెడ్ వాటర్ వర్క్స్, గుప్తా సెంటర్, పున్నమి ఘాట్ ప్రాంతాలలోని 194, 119, 159, 121 సచివాలయాలను గురువారం జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైస్ కార్డులకు సంబంధించి ఈకేవైసీ విధానాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సంక్షేమ పథకాల వివరాలతో కూడిన పోస్టర్స్ పరిశీలించారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున సర్వీసులు, సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి సచివాలయాలకు వస్తారని వారిని సిబ్బంది మర్యాదపూర్వకంగా పలకరించి వీలైనంత మేరకు ఆయా సమస్యలను సంభందిత శాఖల ద్వారా పరిష్కరించాలని అన్నారు. స్థానిక సచివాలయాల పరిసరాలలో పారిశుధ్యం మెరుగుపరచడంతో పాటు చెత్త సేకరణలో ప్రజలకు అవగాహన కల్పించాలని జెసి అన్నారు.

అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్

ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారిస్తూ వినియోగదారులకు సేవలు అందిస్తున్న అమెజాన్ వెబ్ సర్వీసెస్‌ను ప్రారంభించిందని ఇందులో భాగంగా కెరీర్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కెరీర్ ప్రోగ్రామ్స్‌లో భాగంగా వివిధ కార్యక్రమాలను రూపొందించి నిపుణులైన సిబ్బంది పర్యవేక్షణలో కార్యక్రమాలను విద్యార్థులకు, యవతకు స్కిల్స్ పెంపొందించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు గతంలో కూడా అమెజాన్ ఇండియా పలు కార్యక్రమాలను నిర్వహించిందని, రానున్న కాలంలో కూడా నిర్వహిస్తుందని తెలిపారు.

బాలోత్సవంలో విపి సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్



అమరావతి బాలోత్సవ్ ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక పోటీలలో మొగల్‌రాజపురంలోని విపి సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరచి పతకాలు సాధించారని స్కూల్ ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య తెలిపారు. పాఠశాల ఆవరణలో గురువారం పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ తమ విద్యార్థులు నాలుగు ప్రథమ బహుమతులు, 10 ద్వితీయ, 21 తృతీయ బహుమతులు సాధించారని తెలిపారు. తమ విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక సాంస్కృతిక అన్ని అంశాలపై కూడా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ రోజ్ మేరీ విద్యార్థులను అభినందించారు.

ముగిసిన భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయవాడ

రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలు స్థానిక గవర్నర్‌పేట-2 డిపో గ్యారేజ్‌లో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎపిఎస్‌ఆర్‌టిసి భద్రతకు మారు పేరన్నారు. అహర్నిశలు ప్రమాదాలు నివారించడానికి ఆర్టీసి సంస్థ అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రమాదాలు నివారించడానికి డ్రైవర్ల పాత్ర చాలా ముఖ్యమైందన్నారు. ప్రమాదాలు నివారించడానికి బస్సుల నిర్వహణను మెరుగుపరచడం, సిబ్బందికి శిక్షణా తరగతుల ద్వారా నైపుణ్యం పెంచడం జరుగుతుందన్నారు. సిబ్బంది ఆరోగ్యం మీద శ్రద్ధ చూపించడం వంటి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రయాణికుల భద్రతకు పూర్తి భరోసా ఇస్తూ మన్ననలు చూరగొంటామని తెలిపారు. అనంతరం ఎన్‌టిఆర్ జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.యేసుదానం, డిప్యూటీ సిటిఎం ఎ.జాన్ సుధాకర్ మాట్లాడారు.





23వ డివిజన్లో విష్ణు పర్యటన

ప్రజాశక్తి-విజయవాడ: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజాసమస్యల పరిష్కారానికి ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గురువారం 23వ డివిజన్ 98వ వార్డు సచివాలయ పరిధిలో ఎమ్మెల్యే పర్యటించారు. తొలుత మాజీ సిఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ శాఖల అధికారులతో మాట్లాడి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. పారిశుధ్య నిర్వహణ తీరు, డ్రెయిన్స్ నందు మురుగునీటి పారుదల విధానాన్ని పరిశీలించారు. ప్రజా సమస్యల తక్షణ పరిష్కారంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముఖ్య భూమిక పోషిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, డీఈలు గురునాథం, రామకష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రూ.99 ప్యాక్‌ను విడుదల చేసిన 'వి'

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రతి ఒక్కరికీ మొబైల్ సేవలను అందించాలనే ఉద్దేశంతోఒ ప్రముఖ టెలికామ్ సంస్థ 'వి' రూ.99 ప్యాక్ విడుదల చేసినట్లు సంస్థ రీజనల్ ప్రతినిధి కె.సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా రు. 99లకే వినియోగదారులకు వి టెలికాం సేవలను అందిస్తుందన్నారు. మొబైల్ కనెక్టివిలటీ వాయిస్, డాటా సేవల వ్యాప్తంగా అతి తక్కువగా 99 రూపాలయ వద్ద హై స్పీడ్ డేటా నెట్‌వర్క్‌ను అందిస్తుందన్నారు. వినియోగదారులకు ఫుట్ టాక్‌టైమ్‌తో పాటు 200 ఎంబీ డేటాను, 28 రోజుల వ్యాలిడిటీతో పొందే అవకాశం రూ.99 రీఛార్జితోనే అందిస్తున్నట్లు తెలిపారు.